# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 27, ఫిబ్రవరి 2026


కొమురం భీం జిల్లాలో

# స్వల్ప భూకంపం

✦ బెజ్జూర్,చింతల మానేపల్లి, కౌటాల మండలాల్లో స్వల్పంగా కంపించిన భూమి

బెజ్జూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం అర్ధరాత్రి వేళ భూమి స్వల్పంగా కంపించింది. బెజ్జూర్, చింతల మానేపల్లి, కౌటాల మండలాల్లో రాత్రి 11:50 నిమిషాలకు భూమి స్వల్పంగా కంపించినట్లు ఆయా మండలాల ప్రజలు చర్చించుకున్నారు. రాత్రి సమయంలో కంపించడంతో చాలామంది ప్రజలు దీన్ని గుర్తించనప్పటికీ కొంతమంది భూమి కదలికలను గుర్తించి ఆందోళనతో ఇళ్ల నుండి బయటికి వెళ్లి చూశారు. భూమి మూడు సెకండ్ల పాటు మాత్రమే కంపించడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. గురువారం ఉదయం లేవగానే ఒకరితో మరొకరు ఈ విషయంపై చర్చించారు. ఈ భూకంపం ఆయా మండలాల్లో సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. సీసీ కెమెరా రికార్డుల్లో ప్రజలు భూమి స్వల్పంగా మూడు సెకండ్ల పాటు కనిపించిన విధానాన్ని పరిశీలించి భూకంపం సంభవించినట్లు నిర్ధారించుకున్నారు. అధికారులు మాత్రం ఇట్టి విషయంపై ఎలాంటి నిర్ధారణ ఇవ్వలేదు.





విద్యుత్ స్తంభం చుట్టూ

# చెట్లు తొలగింపు

వార్త కథనానికి స్పందన

దీపక్‌నగర్‌లో వెంటనే చర్యలు.. కాలనీవాసుల హర్షం

మందమర్రి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని దీపక్ నగర్ 16వ వార్డులో విద్యుత్ స్తంభం చుట్టూ చెట్లు విపరీతంగా పెరిగి వీధి దీపం వెలగకుండా ఉండటం, అలాగే కాలువలలో చెత్త పేరుకుపోవడం పై ఇటీవల ప్రచురితమైన వార్త పత్రిక కథనానికి సంబంధిత అధికారులు తక్షణమే స్పందించారు. వార్తా పత్రికలో కథనం వెలువడిన వెంటనే విద్యుత్ స్తంభం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి, వీధి దీపం సరిగా వెలిగేలా చర్యలు చేపట్టారు. అదేవిధంగా కాలనీలోని కాలువలలో మిగతా 2లో..

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు




★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్‌టిసి, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రమాదాల నివారణల భాగంగా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు మిగతా 2లో..

# గోదావరి పుష్కరాల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలి

✪ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు ఇప్పటి నుంచే పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాసర క్షేత్రాన్ని దర్శించుకునేందుకు, గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ రాష్ట్రాల నుండి భక్తులు మిగతా 2లో..



# నర్సరీ చిన్నారిపై క్రూరత్వం..

★ ఉపాధ్యాయురాలి దాడితో ఆగ్రహ జ్వాలలు

★ ఓ ప్రైవేట్ స్కూల్‌లో అమానుష ఘటన

మందమర్రి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చోటుచేసుకున్న అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. నర్సరీ చదువుతున్న అందుగు లపేట గ్రామానికి చెందిన ఓ చిన్నారిని ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు చితకబాదిన ఘటన వెలుగులోకి రావడంతో తల్లిదండ్రులు, గ్రామ స్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో చదువుకునే వయస్సులో ఉన్న మిగతా 2లో..









# రూ. 3 లక్షలు దొంగిలిచ్చిన సైబర్ కేటుగాళ్లు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన బిజెపి నాయకుడు, పవర్ జిమ్ నిర్వాహకుడు ఖాండ్రే విశాల్ కు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి రూ. 3,09,000 సైబర్ కేటుగాళ్ళు దొంగిలిచ్చారు. గురువారం భాదితుడు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక్క సారిగా తన ఫోన్‌కు మెసేజ్ లు రావడంతో గమనించగా సైబర్ దుండగులు రూ. 500ల నుంచి మిగతా 2లో..

## విద్యుత్ స్తంభం చుట్టూ చెట్లు తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు కాలువల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను కూడా తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ చర్యలతో కాలనీలో పరిశుభ్రత మెరుగుపడడంతో పాటు రాత్రి వేళల్లో వీధి దీపం వెలగడం వల్ల ప్రజలకు సురక్షిత వాతావరణం ఏర్పడింది. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన వార్తాపత్రికకు, వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులకు దీపక్ నగర్ కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారంలో వార్త పత్రిక పాత్ర కీలకమని, ఇలాంటి సమస్యలపై అధికారులు ఇదే విధంగా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## గోదావరి పుష్కరాల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలి

(మొదటిపేజీ తరువాయి)

భారీగా వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. భక్తులకు పార్కింగ్, తాగునీరు, వసతి, లైటింగ్, పారిశుధ్య సౌకర్యాలు కల్పించాలని, ఘాట్ల వద్ద పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పుష్కరాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు, నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీలు రాజేష్ మీనా, సాయికిరణ్, బాసర ఆలయ ఈవో విజయ రామారావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నర్సరీ చిన్నారిపై క్రూరత్వం..

(మొదటిపేజీ తరువాయి)

చిన్నారిపై ఇలాంటి దారుణంగా ప్రవర్తించడం బాధ్యతాయుత ఉపాధ్యాయ వృత్తికి మచ్చ తెచ్చే చర్యగా స్థానికులు మండిపడుతున్నారు. చదువు నేర్పాల్సిన ఉపాధ్యాయురాలు శారీరకంగా హింసించడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఇంటికి చేరుకున్న తర్వాత గాయాల గుర్తులు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఈ ఘటనపై ప్రశ్నించగా విషయం బయట పడినట్లు తెలిసింది. ఈ ఘటనతో ఆగ్రహించిన చిన్నారి తల్లిదండ్రులు, గ్రామస్తులు సంబంధిత ఉపాధ్యాయురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం కూడా ఈ ఘటనపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చిన్నారుల భద్రత, మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, విద్యాసంస్థలు శిక్షణ కేంద్రాలుగా ఉండాలి గానీ శిక్షల కేంద్రాలుగా మారకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రూ. 3 లక్షలు దొంగిలిచ్చిన సైబర్ కేటుగాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

రూ. 50 వేల వరకు ఇలా కొద్దికొద్దిగా కొంత డబ్బును బ్యాంక్ ఖాతాల నుండి డ్రా అయ్యాయని, తన ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు పోవడంతో అవక్కయ్యాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు...తాను ఎలాంటి లింకులను కూడా క్లిక్ చేయలేదని, అయిన కూడా తన బ్యాంక్ ఖాతా నుండి సైబర్ కేటుగాళ్లు డబ్బులను దండుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అధికారులు స్పందించి తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

## ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

### - మంచిర్యాల జిల్లా జాయింట్ కలెక్టర్, ఫ్లయింగ్ స్క్వాడ్ శంకర్

**జన్నారం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా జాయింట్ కలెక్టర్, ఫ్లయింగ్ స్క్వాడ్ శంకర్ అన్నారు. గురువారం నాడు జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ద్వితీయ భాష తెలుగు పరీక్ష జరుగుతున్నందున ప్రతీ పరీక్ష గదిని కలియ తిరిగి విద్యార్థులు పరీక్ష వ్రాసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ రోజు జరిగిన పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 142 మంది విద్యార్థులకు గాను 138 మంది విద్యార్థులు హాజరయ్యారని, నలుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల సూపరింటెండెంట్ బాపురావు, డిపార్టుమెంటల్ ఆఫీసర్ గట్టు వెంకటస్వామి తెలిపారు.




# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిసిపి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల నివారణను 20 శాతం మేర తగ్గించేలా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, జిల్లాలో హాట్ స్పాట్‌లను గుర్తించడం జరిగిందని, నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

**మంచిర్యాల,ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, మంచిర్యాల పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది బందోబస్తు, పెట్రోలింగ్ చేస్తూ పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీపీ వెంట మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాలను సందర్శిస్తున్న రామగుండం సీపీ

## మహోన్నత చరిత్ర కలిగిన ప్రాంతం గాంధారి ఖిల్లా

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలంలోని గాంధారి ఖిల్లాకు మహోన్నత చరిత్ర ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో నాయక్పోడ్ సేవా సంఘం ప్రతినిధి పల్ల సత్యనారాయణ, పుస్తక రచయిత మేసినేని రాజన్న, నాయక్పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి గంజి రాజన్న, జిల్లా ప్రతినిధులు పెద్ది రాజన్న, గాంధారి మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి దైనేని రమేష్‌లతో కలిసి గాంధారి చల్లా చరిత్ర భాగం-1 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వకాలం ఈ ప్రాంతంలో పాండవులు పర్యటించినట్లు చరిత్ర ఉందని, గిరిజనులు పాండవులను ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని తెలిపారు. తెలంగాణలో వనదేవతలను కొలిచే ఆచారం ప్రసిద్ధి పొందిందని, ఈ క్రమంలో గాంధారిచల్లా మైసమ్మను దేవతగా కొలుస్తారని తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన గాంధారి చల్లా ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తక రచన చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



గాంధారి ఖిల్లా చరిత్ర భాగం-I పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

## కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి

### - మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత - వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో పట్టణ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత అన్నారు. గురువారం పట్టణ సమస్యలపై కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వైస్ చైర్మన్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో (భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్) కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మౌలిక వసతుల సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ముఖ్యంగా రహదారుల దుస్థితి, పారిశుధ్య సమస్యలు, డ్రైనేజ్ వ్యవస్థ లోపాలు, తాగునీటి సరఫరా అంతరాయాలు వంటి ఆయా అంశాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత గారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పరిపాలన యంత్రాంగం చురుకుగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత



## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వరం

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**నేరడిగొండ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి బిడ్డ పెళ్లికి ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాలను ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఇచ్చిన హామీ ప్రకారం లక్ష రూపాయలతో పాటు తులం బంగారాన్ని కూడా అందించి తమ బాధ్యతను నెరవేర్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు నీలిమ రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, అనిల్ జాదవ్ యువసేన అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సాయి నగర్ తండాలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

**సారంగాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

మండలంలోని సాయి నగర్ తండాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు గురువారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత గోపాల్ సింగ్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం, హైందవ ధర్మ పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుడు శివాజీ అని కొనియాడారు. ఆయన వీరగాథలను, ఆదర్శాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవి సింగ్, నానక్ సింగ్, గణేష్, ప్రకాష్‌లతో పాటు గ్రామ పెద్దలు, తండా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**సారంగాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

మండలంలోని తాండ్ర(జి) గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్ 2లో ఐదేళ్లలోపు చిన్నారులకు గురువారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కొప్పుల వెన్నెల నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు ఈ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, చిన్నారుల ఆరోగ్యం విషయంలో తల్లులు, సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గోదావరి, ఆయా గంగవ్వ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



### గోదావరి పుష్కరాల నిర్వహణకు

# కార్యాచరణ సిద్ధం చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

గోదావరి పుష్కరాల నిర్వహణకు పూర్తి కార్యాచరణ సిద్ధం చేయగలరు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు లతో కలిసి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ, పోలీస్, రెవెన్యూ, వైద్య, విద్యుత్, మత్స్య, నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు దక్షిణాది కుంభమేళా తరహాలో ఉంటాయని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి నది పరివాహకంలో అనువైన ప్రాంతాల్లో పుష్కరాల ఏర్పాట్ల కొరకు తీసుకుంటున్న చర్యలలో భాగంగా జిల్లాలోని గోదావరి నది తీర ప్రాంతాల్లో పుష్కర ఘాట్ల ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి కార్యచరణ సిద్ధం చేయాలని తెలిపారు. అధిక సంఖ్యలో మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరంలో పుష్కర స్నానాలు ఆచరిస్తారని, తరువాత గూడెంలో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్థానాలకు హాజరవుతారని తెలిపారు. పార్కింగ్, హోల్డింగ్ ఏరియా, పండల్ ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, ప్రజా రవాణా వ్యవస్థ, డ్రోన్ ద్వారా పర్యవేక్షణ, పుష్కర ఘాట్ ప్రాంతాలలో లైటింగ్, తాగునీటి ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని, ఈ విషయమై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రితో సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రతిపాదనలు, కార్యచరణ సిద్ధం చేసి అందించాలని తెలిపారు. పుష్కరాలలో భక్తుల సంఖ్య అంచనా ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఈ క్రమంలో మంచిర్యాలలో 2 లక్షల మంది, వేలాలలో 50 వేల మంది, చెన్నూరు ప్రాంతంలో సైతం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. నీటిపారుదల శాఖ నివేదిక ఆధారంగా నూతన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వెలుతురు, పారిశుద్ధం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. భక్తుల సంరక్షణ దిశగా మత్స్య శాఖ ఆధ్వర్యంలో పుష్కర స్నానాల ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని, పుష్కరాల నిర్వహణ కొరకు నోడల్ అధికారులను నియమించడం జరుగుతుందని తెలిపారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు అంచనాలకు మించి భక్తులు వచ్చే అవకాశం ఉందని, కార్యాచరణ రూపొందించడంలో జాగ్రత్తలు వహించాలని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలని, పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తదనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పుష్కర ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

## రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వం పొందాలి

**- జిల్లా సహకార శాఖ అధికారి సత్యనారాయణ గౌడ్**

**వేమనపల్లి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

రైతు ఉత్పత్తి దారుల సంఘంలో సభ్యులుగా చేరితే రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని జిల్లా సహకార శాఖ అధికారి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నీల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ బలోపేతం కోసం వివిధ గ్రామాల సర్పంచ్‌లను కలిసి ప్రత్యేకంగా చర్చించారు. ప్రతి రైతు రూ.2వేలు చెల్లించి ఉత్పత్తి దారుల సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని, దీని వల్ల రైతులకు మార్కెటింగ్, విత్తన సరఫరాలో ప్రాధాన్యత లభిస్తుందని వివరించారు. గ్రామాల్లోని రైతులకు ఈ సంస్థ యొక్క ప్రయోజనాలను వివరించి, వారిని సభ్యులుగా చేర్పించడంలో సర్పంచ్‌లు తమవంతు సహకారం అందించాలని కోరారు. రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేలా చేయడం, దళారీల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయాలు జరుపుకోవడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సెక్రటరీ భుక్య రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ వివిధ గ్రామాల సర్పంచ్ లు చెన్నూరి సమ్మయ్య, గురుండ్ల శ్రీనివాస్, వుప్పులపు సాయిక్రిష్ణ, దుర్గం భాగ్యలక్ష్మి, ఆలం లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.



సభ్యత్వ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

## కష్టమైన ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగొచ్చు

**వేమనపల్లి, ప్రభాతవార్త**




మాట్లాడుతున్న దృశ్యం

కష్టమైన ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని ఆ దిశగా ప్రతి ఒక్క విద్యార్థి చక్కగా చదువుకోవాలని ప్రముఖ లీడ్ ఇండియా మేనేజర్ హైదరాబాద్ శ్రీనివాస చారి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ప్రకాష్ బానావత్ ఇరువురు కలిసి విద్యార్థులకు ధైర్యాన్ని కలిగించారు. మండలంలోని నీల్వాయి కేజీబీవీ, హై స్కూల్ విద్యార్థులకు నీల్వాయి రైతు వేదికలో పరీక్షలపై ప్రేరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పరీక్షలు దగ్గర వస్తున్న కొద్దీ పిల్లల్లో ఒత్తిడి, భయం పెరిగి ఆందోళన చెందుతారు, సమయ ప్రణాళిక చేసుకోకపోవడం, చదివినది సంపూర్ణంగా అర్థం కాకపోవడం, పరీక్ష ఫెయిలవుతానేమోనని భయం, మంచి మార్కులు వస్తాయో లేదో అనే భయం, తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయుల నుంచి ఒత్తిడి, ఇలాంటి కారణాల చేత విద్యార్థులు ఆందోళన చెందుతారనీ, ఈ పరీక్షల భయాన్ని దూరం చేసుకోవాలంటే ఎగ్జామ్ ఫియర్ నీ డియర్ అనుకోవాలనీ, అప్పుడే పరీక్షలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా విజయవంతంగా రాయవచ్చని అన్నారు. విద్యార్థులు పరీక్షలు ఆనందంగా రాయాలంటే ప్రధానంగా పైన పేర్కొన్న చిట్కాలు పాటించగలిగితే పిల్లలు పరీక్షలు ఒత్తిడి లేకుండా అద్భుతంగా రాయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి, ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, సయ్యద్ సాబీర్ అలీ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోర్‌వెల్‌కు మరమ్మతులు

**తాండూర్, ప్రభాతవార్త :**



మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ బోర్వెల్‌కు గురువారం సర్పంచ్ మామిడాల లలిత మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోర్‌వెల్‌కు మరమ్మత్తులు చేయించాలని, కాలనీవాసులు తన దృష్టికి తెచ్చారన్నారు. దీంతో దగ్గరుండి పనులు ప్రారంభించిన చేయించానని సర్పంచ్ తెలిపారు. బోర్వెల్ కు మరమ్మతులు చేయించిన సర్పంచ్ కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక సదస్సు

## పరీక్షల్లో ఒత్తిడిని జయించి విజయం సాధించాలి



**నిర్మల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

మామడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రేరణాత్మక సదస్సు ఉత్సాహంగా సాగింది. మార్చి 13 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో, విద్యార్థులలో నెలకొన్న భయాన్ని పోగొట్టి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సదస్సులో మమడ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో పాటు కేజీబీవీ, ఎంజేపీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ సురేష్ అల్లాడి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కీలక సూచనలు చేశారు. పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో ఒక కీలక మలుపు అని, దీనిని భయంగా కాకుండా ఒక అవకాశంగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారని, దానివల్ల తెలిసిన జవాబులు కూడా మర్చిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఈ ఒత్తిడిని అధిగమించడానికి ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం, లోతైన శ్వాసాభ్యాసం చేయాలని సూచించారు. విజయం సాధించాలంటే సమయపాలన అత్యంత ముఖ్యమని, చదివిన అంశాలను మాటిమాటికీ పునరావృతం చేయడం వల్ల మెదడులో విషయాలు బలంగా నిక్షిప్తమవుతాయని ఆయన వివరించారు. అలాగే, పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో సమతుల్య ఆహారం తీసుకోవాలని, కంటినిండా తగినంత నిద్ర పోవాలని, ముఖ్యంగా మొబైల్ ఫోన్ల వినియోగానికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని క్రమబద్ధంగా చదివితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఆయన ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. పరీక్షా పత్రాల విశ్లేషణ, సమాధానాలు రాసే పద్ధతులు, మార్కుల కేటాయింపుపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన నియమాలను వివరించారు. ఈ సదస్సుతో తమలో భయం పోయిందని, పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొంటామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్ను కలిసిన సర్పంచులు

## మంచిర్యాల మేయర్‌ను కలిసిన సర్పంచులు

**తాండూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ ను గురువారం తాండూర్ మండలానికి చెందిన పలువురు సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ గా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన మేయర్ మధుకర్ ను సర్పంచులు కలిసి శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కుశ్నపల్లి లక్ష్మీనారాయణ, ఆకుల వెంకటేష్, మాసాడి తిరుపతి, గాట్ల నరసయ్య, చందనాల రవికుమార్, పోలవేణి తిరుపతి, మడావి ప్రభాత్ రావు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ బదిలీ

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**



ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి గురువారం బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆయనను వికారాబాద్ జిల్లా కలెక్టర్ గా పదోన్నతి కల్పిస్తూ అధికారులు ప్రకటన విడుదల చేశారు. 2023 సంవత్సరంలో కుమురం భీం జిల్లా అదనపు కలెక్టర్ గా విధుల్లో చేరి తన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసిన ఆయన, త్వరలోనే వికారాబాద్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## నేడు ఉపాధి హామీ పథకం ప్రజావేదిక

**తాండూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

తాండూర్ మండల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటన తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సామాజిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, అందరూ సకాలంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## అవయవ దానం చేసి అమరురాలైన గుండు సృజన

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**



జిల్లా కేంద్రంలోని జనకపూర్‌కు చెందిన గుండు సృజన (33) గురువారం (25న) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆమె భర్త గుండు నాగరాజుతో కలిసి ఉద్యోగరీత్యా వియత్నాంలో నివసిస్తున్నారు. వీరికి ఐదేళ్ల కుమార్తె, 23 రోజుల పసికందు కుమారుడు ఉన్నారు. ప్రసవం కోసం స్వగ్రామానికి వచ్చిన సృజనకు కొద్ది రోజుల తరువాత అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే ఆమెను మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి మెదడు పనితీరు పూర్తిగా నిలిచిపోయిందని (బ్రెయిన్ డెడ్) నిర్ధారించారు. చికిత్స పొందుతూ గురువారం ఆమె తుది శ్వాస విడిచారు. మరణానంతరం ఆమె అవయవాలు ఇతరులకు ప్రాణాధారంగా మారాలని కుటుంబ సభ్యులు నిర్ణయించి గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలను రాష్ట్ర అవయవ దానం సమన్వయ సంస్థ జీవన్దన్ కు దానం చేశారు. సృజన చేసిన ఈ మహోన్నత అవయవ దానం పలువురికి ప్రాణాలు కాపాడే అవకాశం కల్పించనుంది. ఆమె ఆత్మకు శాంతి కలగాలని స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.



## ఈస్గాం 132/33కేవి సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్ ,ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం 132 /33కేవి సబ్‌స్టేషన్‌లో నూతన 33 కేవి ఎల్కపల్లి బ్రేకర్ ను గురువారం ఆసిఫాబాద్ ఎస్ఈ జాడే ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతం లో దహెగాం 33కేవి బ్రేకర్ పైన ఆరు 33/11కేవి సబ్ స్టేషన్ లు ఉండేవని ఇప్పుడు నూతన 33కేవి ఎల్కపల్లి బ్రేకర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారఉ. దీంతో ఒక్కొక్క బ్రేకర్ పైన 3 సబ్ స్టేషన్ ల విద్యుత్ సరఫరా చేయనున్నామని తెలిపారు. నూతన బ్రేకర్ ఏర్పాటు చేయడంతో దహెగాం, పెంచికల్పేట్ మండలాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం తగ్గుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఈ నాగరాజు, కన్స్ట్రక్షన్ డిఈ వీరేషం, ఏడిఈ లు ఇర్ఫాన్ అహ్మద్, గోపాల్, ఏఈలు రాంప్రసాద్, రవీందర్, లైన్ ఇన్స్పెక్టర్ ఎమ్మాజీ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన శిబిరంలో ట్రైనీ బీట్ అధికారులు

## రాబందుల ఆవాసం వద్ద అవగాహన శిబిరం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

అటవి సంపద సంరక్షణలో భాగంగా రాబందుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఫారెస్ట్ బీట్ అధికారుల ట్రైనీ బ్యాచ్ క్షేత్ర పర్యటన నిర్వహించింది. పెంచికల్ పేట్ రేంజ్ పరిధిలోని రాబందుల ఆవాసంగా ప్రసిద్ధి చెందిన పాలరాపు గుట్ట ప్రాంతాన్ని గురువారం సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పర్యటనకు కోర్స్ డైరెక్టర్ సాహు హాజరై శిక్షణార్థులతో కలిసి ఆవాస ప్రాంతాన్ని పరిశీలించారు. రాబందుల నివాస స్థితి, వాతావరణ అనుకూలతలు, సహజ వనరుల పరిస్థితులపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ జగన్మోహన్ గౌడ్ శిక్షణ బీట్ అధికారులకు రాబందుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యంలో రాబందుల పాత్ర ఎంత కీలకమో వివరించారు. ఇటీవల కాలంలో రాబందులు అంతరించిపోతున్న కారణాలు, వాటి సంఖ్య తగ్గుదలకు దారి తీసిన అంశాలు, సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. రాబందుల సంరక్షణపై ట్రైన్ అధికారులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో అటవీ సంరక్షణ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం అయింది.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## బొంబాయిగూడలో ఉచిత వైద్య శిబిరం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెంచికల్ పేట్ ఆధ్వర్యంలో బొంబాయిగూడ గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరం మరియు ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి 39 మందికి చికిత్స అందించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ సతీష్ రోగులను పరీక్షించి తగిన సూచనలు ఇచ్చారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అనర్తి అలాదర్, ఫార్మసిస్ట్ రమేష్, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఆశా కార్యకర్త రమ్య పాల్గొన్నారు.

## సీసీ కల్వర్ట్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని పెద్దమ్మ రోడ్డు వాగుపై 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ కల్వర్ట్ పనులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో రైతులు, ప్రయాణికులు వాగు దాటడానికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ కల్వర్ట్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సజన్, మాజీ జడ్పీటీసీ జహీర్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ప్రజలతో మమేకమై పని చేయాలి

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

ప్రజలతో మమేకమై పనిచేయాలని జన్నారం, లక్షెట్టిపేట ఎంపీడీవోలు సరోజ, ఉమర్ షరీఫ్ వార్డు సభ్యులకు సూచించారు. లక్షెట్టిపేట, జన్నారం మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా పలు చట్టాలపై వార్డు సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. గ్రామాలలో సమస్యలు పరిష్కారం కావాలంటే అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీడీవోలు సూచించారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఐఈఓ

**సారంగాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును ఆయన స్వయంగా పరిశీలించి, విద్యార్థులకు కల్పించిన వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రంలో విద్యార్థుల హాజరు శాతాన్ని పర్యవేక్షించామని తెలిపారు. కేంద్రంలో మొత్తం 290 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, వారిలో 284 మంది హాజరయ్యారని, 06 గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షలు అత్యంత పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పరీక్షా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

**సారంగాపూర్, ఫిబ్రవరి26, ప్రభాత వార్త:**

మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన ఇస్మాయిల్ (31) స్వర్ణ బ్యాక్ వాటర్ నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం విడాకులు తీసుకున్నాడు, గత మూడు సంవత్సరాలుగా మానసికంగా బాధపడుతున్నట్లు సమాచారం. అతని చికిత్స కోసం అతని కుటుంబ సభ్యులు క్రమం తప్పకుండా వైద్యుడిని సంప్రదిస్తున్నారని అతని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటలకు, మృతుడు ఇంటి నుండి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.. అతని ఆచూకీ కోసం వెతకగా గురువారం సాయంత్రం స్వర్ణ బ్యాక్ వాటర్ బ్రిడ్జ్ దగ్గర నీటిలో మునిగి చనిపోయి ఉన్నాడు. మృతుడు జీవితం పైన విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు అతని తండ్రి ఇబ్రహీం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహమును నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



# ఎగ్జామ్ ఫియర్‌ని... నీ డియర్‌గా భావించుకో..

★ ఇక పరీక్షల్లో నువ్వే విజేతవు ★ పీస్, ప్లాన్, ప్రిపరేషన్, ప్రజెంటేషన్ ఈ నాలుగు చిట్కాలతో ఒత్తిడిని అధిగమించవచ్చు

★ ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ప్రకాష్ బానావత్

**జన్నారం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

పీస్, ప్లాన్, ప్రిపరేషన్, ప్రజెంటేషన్ ఈ నాలుగు చిట్కాలను పాటించండి మీ ఒత్తిడిని సులభంగా జయించవచ్చు అని, అలాగే మీలో ఉన్న ఎగ్జామ్ ఫియర్‌ను నీ డియర్ అనుకోండి ఇక పరీక్షల్లో మీరు అద్భుత ఫలితాలు సాధిస్తారని, మీరే గొప్ప విజేతలు అవుతారని ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ప్రకాష్ బానావత్ విద్యార్థినులకు ధైర్యాన్ని కలిగించారు. జన్నారం మండల కేంద్రములోని పి.ఎం.శ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిలకు పరీక్షల పై ప్రేరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ ప్రకాష్ బానావత్ హాజరై మాట్లాడుతూ పరీక్షలు దగ్గర వస్తున్న కొద్ది పిల్లల్లో ఒత్తిడి, భయం పెరిగి ఆందోళన చెందుతారు, సమయ ప్రణాళిక చేసుకోకపోవడం, చదివినది సంపూర్ణంగా అర్థం కాకపోవడం, పరీక్ష ఫెయిలవుతానేమోనని భయం, మంచి మార్కులు వస్తాయో లేదో అనే భయం, తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయుల నుంచి ఒత్తిడి, ఇలాంటి కారణాల చేత విద్యార్థులు ఆందోళన చెందుతారనీ, ఈ పరీక్షల భయాన్ని దూరం చేసుకోవాలంటే ఎగ్జామ్ ఫియర్.. నీ డియర్ అనుకోవాలని, అప్పుడే పరీక్షలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా విజయవంతంగా రాస్తారు అని ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ప్రకాష్ బానావత్ అన్నారు. విద్యార్థులు పరీక్షలు ఆనందంగా రాయాలంటే ప్రధానంగా పైన పేర్కొన్న చిట్కాలు పాటించగలిగితే పిల్లలు పరీక్షలు ఒత్తిడి లేకుండా అద్భుతంగా రాయవచ్చు అని తెలిపారు. చదువుపై నమ్మకం పెట్టుకోవాలని, లోతైన శ్వాసతో మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి, ఇతరులతో పోలికలు చేసుకోకుండా, సమయ ప్రణాళిక, విషయ ప్రణాళిక, సంసిద్ధతను ఏర్పరచుకొని పరీక్ష గదిలో మంచి ప్రదర్శన ఇవ్వాలని వారు కోరారు. పరీక్షకు వెళ్లే రోజు ఉదయాన్నే సంతోషంగా నిద్ర లేవాలని, పరీక్షకు కావలసినవి ముందు రోజు సాయంత్రానికి సర్దుకోవాలని, తేలికపాటి అల్పాహారం తీసుకోవాలి, 40 నిమిషాల ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకునే విధంగా ప్రణాళిక చేసుకోవాలి, గదిలో కూర్చున్నాక ఐదు నిమిషాల పాటు దీర్ఘంగా శ్వాస తీసుకుని వదలాలి, ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివి అందులోనుండి బాగా వచ్చినటువంటి జవాబుతో ప్రారంభించాలి, అన్ని ప్రశ్నలకు చక్కని దస్తూరితో సమాధానాలు రాయాలి, చివరి ఐదు నిమిషాలు పేపర్‌ని మొదటి నుండి చివరి వరకు పరిశీలించాలి, ఎగ్జామ్ హాల్ నుండి బయటకు వచ్చాక రాసినటువంటి జవాబు పత్రం గురించి చర్చించ వద్దు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోళ్ళ రామన్న, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రముఖ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ప్రకాష్ బానావత్

## భక్తిశ్రద్ధలతో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండల మోసం గ్రామంలో గురువారం పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత అయిన పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి వేద మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురోహితులు శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప-రమాదేవి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజల సంక్షేమం, శాంతి సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమన్ కార్ పద్మ-వసంత్ రావు, ఉప సర్పంచ్ రోహిణి పుష్పలత-రామయ్య, మాజీ సర్పంచ్ కునుషోత్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ రౌతు సంతోష్, వార్డ్ మెంబర్లు అంబిలపు గురు, కునుషోత్ దేవయ్య, రమేష్, సత్యన్న, పిప్పిరె పురుషోత్తం, రాజేందర్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో హాజరు కావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణంతో నెలకొంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు

## రాంప్ ద్వారా మహిళలకు
# నిర్మాణాత్మక వ్యాపార త్వరణం మద్దతు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

రాంప్ మహిళా త్వరణ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎంఎస్‌ఎంఈలకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణం మద్దతును అందించడం జరుగుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోత్ దత్తారావు అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో సెర్ప్ డిపిఎం నాన్ ఫామ్ నాగజ్యోతి, వీ హబ్ సంచాలకులు జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఉహాలతో కలిసి ఐటిఈసి విభాగం, వీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు, భారత ఎంఎస్‌ఎమ్ఈ మంత్రిత్వ శాఖ మద్దతుతో రాంప్ ద్వారా మహిళల నేతృత్వంలోని సంస్థలు, ఎంఎస్‌ఎమ్ఈ నిర్మాణాత్మక వ్యాపార రంగాలలో మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. రెండేళ్ల ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన మహిళా వ్యవస్థాపకులకు వ్యాపార వృద్ధిని వేగవంతం చేసేందుకు, వారి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం అందిస్తుందని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న నిపుణులు

# పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

జిల్లాలో జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని, పరీక్ష కేంద్రాలలో క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ప్రకారంగా ప్రశ్నాపత్రాలు వెళ్లేలా అధికారులు పర్యవేక్షించాలని, పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని, అభ్యర్థులను లోనికి అనుమతించే సమయంలో పకడ్బందీగా తనిఖీ నిర్వహించాలని తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, పరీక్ష కేంద్రాల నిర్వహణ, హాజరు పర్యవేక్షణ, నివేదికల పంపిణీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షల నిర్వహణలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ జనార్ధన్, సహాయ సంచాలకులు సచ్చిదానంద చారి, ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, ప్రణాళిక సమన్వయకర్త లతీఫ్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, మండల విద్యాధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్స్ కేటాయింపు

## కౌన్సిలింగ్‌కు 101 దరఖాస్తుల్లో 17 మందికి కేటాయింపు



సింగరేణి ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

**మందమర్రి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియా పరిధిలోని సిఈఆర్ క్లబ్‌లో ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియాలోని ఉద్యోగుల కోసం మొత్తం 101 క్వార్టర్స్‌ను ప్రకటించగా, అదే సంఖ్యలో 101 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. డివైపివై ఆసిఫ్ మాట్లాడుతూ, ఉద్యోగుల సీనియార్టీ ప్రాతిపదికన పూర్తి పారదర్శకంగా కౌన్సిలింగ్ ప్రక్రియను నిర్వహించి, అందులో భాగంగా 17 మంది ఎన్.సి.డబ్ల్యూ.ఏ మందమర్రి ఏరియ ఉద్యోగులకు క్వార్టర్స్‌ను కేటాయించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, సివిల్ ఈఈ రాజు, మేనేజ్‌మెంట్ ట్రైనీ ఐఈడీ శ్యామ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు తదితర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు. క్వార్టర్స్ కేటాయింపుతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ, సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఐఎన్‌టీఎస్ఓలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

## జాతీయ స్థాయిలో మదీహా సదీమ్ ప్రథమ స్థానం

**నస్పూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అయూబ్, ఉపాధ్యాయులు

డిసెంబర్ నెలలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్ఓ) పరీక్షల్లో మంచిర్యాల లక్ష్మీనగర్ బ్రాంచ్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అఖిల భారత స్థాయిలో 9వ తరగతి విద్యార్థిని మదీహా సదీమ్ ప్రథమ బహుమతి సాధించి అగ్రస్థానంలో నిలిచింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ప్రిన్సిపాల్ అయూబ్ టాపర్లను అభినందించారు. ఈ పోటీల్లో వివిధ తరగతుల విద్యార్థులు ఉన్నత స్థానాలను కైవసం చేసుకున్నారు. 7వ తరగతికి చెందిన జగదీశ్వర్, 5వ తరగతి రిషిత ద్వితీయ బహుమతులు సాధించారు. 6వ తరగతి విద్యార్థిని రాంటెంకి సహస్ర, 3వ తరగతి సుహాన్ అనురాగ్ తృతీయ బహుమతులు పొందారు. 8వ తరగతికి చెందిన వొల్లాల శ్రీ హర్ష, 4వ తరగతి ప్రణవ్ నాలుగో బహుమతి గెలుచుకున్నారు. 5వ తరగతి శ్రీనిత్య, 7వ తరగతి అక్షిత ఐదో బహుమతిని అందుకున్నారు. జాతీయ స్థాయిలో పాఠశాల పేరు నిలబెట్టిన విద్యార్థులను చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం అరవింద్‌రెడ్డి ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త జయరాజ్, మంచిర్యాల సమన్వయకర్త నాగరాజు, జయశ్రీ, డీన్ శ్యామ్, ప్రాథమిక ఇంచార్జి అనగమాత విద్యార్థులను అభినందించిన వారిలో ఉన్నారు.

# శ్రీరాంపూర్ ఐటీఐలో ఉచిత నైపుణ్య శిక్షణ: ప్రిన్సిపాల్ టి. సుజాత

## - పీఎంకేవీవై 4.0 కింద మూడు కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**నస్పూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) 4.0 పథకం కింద మూడు రకాల కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ టి. సుజాత తెలిపారు. 3డి ప్రింటింగ్ ఆపరేటర్, ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్, సీఎన్సీ ప్రోగ్రామర్ విభాగాల్లో శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు గురువారం పేర్కొన్నారు. మార్చి 3వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 4 నుండి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ శిక్షణ కాలపరిమితి మూడు నెలలు ఉంటుందని ప్రిన్సిపాల్ వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు ఐటీఐలో సమర్పించాలని సూచించారు. శిక్షణ సమయంలో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9704456295 నంబరులో సంప్రదించాలని తెలిపారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడిఓ

# అభివృద్ధి పనుల పురోగతిపై పరిశీలన

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

మండల అభివృద్ధి అధికారి ( ఎంపీడీవో ) ఆల్బర్ట్ గురువారం దర్గోపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిని సమీక్షించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, నూతన వంటగదుల పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనులు వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతపై ఆరా తీసి, పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మధుకర్, నాయకులు బొట్టుపెల్లి హరీష్, తదితరులు పాల్గొన్నారు.



ఈస్గాం శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

# ఈస్గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో వైభవంగా దీపాలంకరణ

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వైభవంగా ప్రత్యేక దీపాలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుద్దీపాలతో అలంకరించారు. సాయంత్రం సమయంలో వెలిగించిన నూనె దీపాలతో ఆలయం దివ్య కాంతులతో మెరిసిపోయింది. ఆలయ అర్చకులు ఇందారపు సంతోష్ శర్మ స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆరుద్ర నక్షత్రం శివారాధనకు అత్యంత పవిత్రమైనదిగా భావించడంతో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన దీపాలంకరణ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

**హాజీపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వేంపల్లిలోని ఎస్ఆర్ఎమ్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వేంపల్లిలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు, పరీక్ష నిబంధనల ప్రకారం పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులను మూసి వేయించామని తెలిపారు.